క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, లింగాలలో 2024–25 సంవత్సరానికి రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఐటీఐ లింగాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని, వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. వెరిఫికేషన్ అయిన అభ్యర్థులకు 27వ తేదీ ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు 10వ తరగతి మార్కులిస్టు, టిసి, స్టడీ, కండక్ట్ సర్టిఫికెట్, కులధృవీకరణ, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్, ఎక్స్ సర్వీస్, ఫోటోలు, మెయిల్‌ఐడీతో లింగాల ఐటీఐలో హాజరుకావాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

జమ్మలమడుగు : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం యువ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడం కోసం ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

26న ఆలయ భూముల వేలం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న శ్రీ మాధవ-ఆంజనేయ,శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవస్థానాలకు సంబంధించిన భూములకు మూడు సంవత్సరాల కౌలుకు ఈ నెల 26న దేవాలయ ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. శ్రీ మాధవ-ఆంజనేయ దేవాలయానికి సంబంధించిన 130.86 ఎకరాలు, శ్రీ ఈశ్వర-వీరభద్ర దేవాలయానికి సంబంధించిన 28.93 ఎకరాలకు వేలం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


సమావేశంలో మాట్లాడుతున్న వీఓఏ

లింగాల : పొదుపు సంఘాల్లోని సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వీఓఏ అన్నారు. సోమవారం లింగాల గ్రామసంఘం -1 సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏ మాట్లాడుతూ అందుకున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని, సంఘాలు బలోపేతం కావాలని తెలిపారు. అనంతరం సంఘంలోని సభ్యులు సమస్యల గురించి సమావేశాలు ఏర్పాటు చేసుకుని చర్చించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఓఏ, సీసీలు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

పెండ్లిమర్రి : మండలంలో మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఓబులేసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి రోజు రెండు రెవెన్యూ గ్రామాల పరిధిలో కార్యక్రమం ఉంటుందన్నారు. మంగళవారం గంగనపల్లె, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి


సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి పట్టణంలో ఎక్కడేకాని నీటి సమస్య ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల తక్షణమే పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే వీధి దీపాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని చోట్ల వీధి దీపాలు వెలిగేలా చూడాలని సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

గొంతు విప్పాలి..
అభివృద్ధి సాధించాలి



నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. పాలకులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా కూటడి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ స్థానికంగా నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని వాగ్దానాలు చేశారు. అలాగే తాము అధికారంలోకి వస్తే.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. పరిశ్రమలు, ఫ్యాక్టరీలు తీసుకొస్తాం. ఉద్యోగులను భర్తీచేస్తామని ఊదరగొట్టారు. కానీ ఇంతవరకు వాటి ఊసే ఎత్తడం లేదు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు గళం విప్పాలని, సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధికి పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న స్టీల్ ప్లాంట్ పూర్తి చేయాలి. రాష్ట్ర విభజన సమయంలో శ్రీకృష్ణ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం వెనుకబడిన కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నివేదికలో పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయలేమంటూ చేతులు ఎత్తేసింది గతంలో మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద ఏర్పాటు చేస్తామని చెప్పిన చంద్రబాబు తిరిగి అధికారంలోనికి వచ్చారు. జమ్మలమడుగు ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఆదేవిధంగా పర్యాటక కేంద్రమైన గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలి.

పంట కాలువలు ఏర్పాటు చేయాలి



సర్వరాయ సాగర్ ప్రాజెక్టు ద్వారా పొలాలకు సాగునీరు అందించేందుకు పంట కాలువలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రాజెక్టుకు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడంతో పాటు కాలువల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలి. దీనివలన రైతులకు ఊరట కలుగుతుంది. మూడు పంటలు పిండించుకొనేందుకు వీలుగా ఉంటుంది. ఇప్పటికే కాలువలకు సంబంధించి సర్వేలు పూర్తి చేయడం జరిగింది,కాని పనులు ప్రారంబించలేదు. ఇప్పటి కైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పనులు ప్రారంబించి రైతులకు మేలు చేయాలి.

- కల్లూరు శ్రీనాథ్‌రెడ్డి, సంగాలపల్లె, వీరపునాయునిపల్లె మండలం

పాగేరు హైలెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాగేరు వంతెన శిధిలావస్థకు చేరింది. దీంతో ఇప్పటికే చాలా మంది ప్రమాదాల బారిన పడి మృతి చెందడం జరిగింది. కమలాపురం, మైదుకూరు నియోజకవర్గాల మధ్య రాక పోకలకు ఎంతో వీలుగా వున్న ఈ రోడ్డున నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కమలాపురం ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తావించి బడ్జెట్‌లో నిధుల మంజూరుకు కృషి చేయాలి.

- డీఎం ఓబులేసు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య.

ఆర్టీసీ బస్టాండ్ నిర్మించండి



గండికోట జలాశయం కింద కొండాపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ముంపునకు గురైంది. స్థానిక కేంద్రంలో బైపాస్ రోడ్డుకు అనుకూలంగా నూతన బస్టాండ్ ఏర్పాటు చేయాలి. వర్షా కాలం వస్తే బస్టాండ్ లేక ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక అధికారుల దృష్టికి తీసికెళ్లినా ఫలితంలేదు.స్థాని ప్రజాప్రనిధి స్పందించి ప్రయాణికుల కోసం ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- పి. వెంకటరమణ, ఎఐటియూసి మండల ప్రధాన కార్యదర్శి, కొండాపురం

గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దాలి



ప్రభుత్వాలు మారిపోతున్నాయి. గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని చెబుతున్నారే తప్ప అభివృద్ధి జరగడంలేదు. గండికోట ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. ఇలాంటి ప్రదేశాన్ని ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలి. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే యువకతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గతంలో మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన చంద్రబాబు తిరిగి అధికారంలోకి వచ్చారు. జమ్మలమడుగు ప్రాంతంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయించి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలి.

- శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

మెరుగైన రోడ్లు కల్పించండి



మండల ప్రజలకు మెరుగైన రోడ్లు కల్పించండి. గత ప్రభుత్వంలో రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు రోడ్లు లేని రాష్ట్రమని హేళన చేశారు. మీరు ఏకంగా రోడ్డు విషయాన్ని మరిచిపోయారు.వర్షాకాలంలో ప్రజలు గుంతలుగా ఉన్న రోడ్లపైన వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికార ప్రభుత్వం వెంటనే స్పందించి, సమస్యలు పరిష్కరించాలి.

- ఎస్.వెంకటప్రసాద్‌రెడ్డి, యర్రగుంట్ల

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో మండలంలో ఉన్న పలు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. రూ92 కోట్లతో అండర్ డ్రైనేజీ, రూ58 కోట్లతో రోడ్లు విస్తరణ పనులు, త్వరగా పూర్తిచేస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ప్రస్తుతం ఎక్కడ పనులు అక్కడ అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే పెండింగ్ పనులు పూర్తి చేయాలి.

- రవి శంకర్ గౌడ్, వేంపల్లి

ప్రభుత్వం చెప్పిన హామీలను అమలు చేయాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు ఉచిత బస్సు, సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగభృతి, ప్రతి మహిళకు రూ.15వేలు, తల్లికి వందనం పథకాలను వెంటనే అమలు చేసి చెప్పిన హామీలను వెంటనే నెరవేర్చాలి. ఎన్నికల ముందు చెప్పిన హామీలన్నింటిని ప్రభుత్వం నెరవేర్చాలి.

- రసూల్, పులివెందుల

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు : మండలంలో ఈ నెల 23 నుంచి 27 వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో విజయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. 23 న తోల్లగంగనపల్లె, 24 న వల్లూరు, 25 న కొప్పోలు, 26న దిగువపల్లె, 27 న లేబాక గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు జరుగుతాయని తెలిపారు. ఇందులో కొత్త ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు ఆధార్ కార్డుల్లో చిరునామా, ఫొటో అప్‌డేషన్, ఫోన్ నంబర్ లింక్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు నేటి నుంచి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సింహాద్రిపురంలోని కేజీబీవీలో, అంకాలమ్మగూడూరులోని హైస్కూల్‌లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

వేంపల్లెలో..

వేముల : మండలంలోని సచివాలయాల్లో 5రోజుల పాటు నిర్వహించే ఆధార్ అప్‌డేట్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయా సచివాలయాల్లో కేటాయించిన తేదీలలో ప్రజలకు ఆధార్ అప్‌డేట్ సేవలను అందించనున్నట్లు చెప్పారు. 23వ తేదీ వేముల, వేల్పుల, వి.కొత్తపల్లె సచివాలయ పరిధిలోని వారికి వేముల సచివాలయంలోనూ, 24వ తేదీ మబ్బుచింతలపల్లి, మీదిపెంట్ల సచివాలయ పరిధిలోని వారికి మబ్బుచింతలపల్లి సచివాలయంలోనూ, 25, 26, 27 తేదీలలో నల్లచెరువుపల్లి, పెద్దజూటూరు, గొల్లలగూడూరు, చాగలేరు సచివాలయాల పరిధిలోని వారు గొల్లలగూడూరు సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ సేవలు పొందవచ్చన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడాలి


ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు

వేంపల్లె : విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకోవాలని వాటిని సాధించేందుకు కష్టపడాలని స్థానిక జెడ్పీ బాలికల ప్లస్ 2 ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ప్లస్ 2 ప్రాంగణంలో ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ విద్యార్థినులు, జూనియర్ ఇంటర్ వారికి స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనవాయితీ అని వెల్లడించారు. దీంతో విద్యార్థినులు పరస్పర సహకారం, సఖ్యతతో ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే విద్యార్థినులు తమకు అర్థం కాని విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే చదివిన చదువుకు సార్థకత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీజీటీ అధ్యాపకులు గురునాథ్‌రెడ్డి, రమేష్, వెంకట్, సురేష్, కృష్ణవేణి, రాధ, రెడ్డిసాయి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన తప్పనిసరి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకట రమణ

వల్లూరు : విద్యార్థి దశ నుంచే పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం వుందని ఎస్‌ఐ కత్తి వెంకట రమణ అన్నారు. మండల పరిధిలోని తోల్లగంగనపల్లె సమీపంలో వున్న వేదాస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం పోలీస్ శాఖ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులకు ఆయన పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఎస్సై గది, పోలీసుల ఆయుధాలు, సెట్ కాన్ఫరెన్స్, ఖైదీల గదులు మొదలైన అంశాలను గురించి వివరించారు.

గండికి టెండర్ల ద్వారా 37.7 లక్షల ఆదాయం


గండి ఆలయ కార్యాలయంలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో టోల్‌గేట్ల వసూలు, పూల విక్రయ హక్కు కోసం నిర్వహించిన ఈ టెండరు, బహిరంగ వేలం ద్వారా రూ.37.7 లక్షల ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. కడప దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ పర్యవేక్షణలో టెండర్లు నిర్వహించారు. టోల్‌గేట్ల వసూలును రూ.18,55,000కు ఓబులేసు దక్కించుకున్నారు. పూల విక్రయ హక్కును రూ.19,15,000కు విజయ కుమార్ పొందారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, పోలీసు, గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో టెండర్లు నిర్వహించారు.

స్థానిక వనరులతో బోధనాభ్యసన ప్రక్రియ సాగించాలి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియ స్థానిక వనరులతో విద్యార్థులకు బోధించడం ద్వారా వారికి సులభంగా అర్థమౌతుందని కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈనెల 22 నుండి 28 వరకు నిర్వహించనున్న శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో మొదటి రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో టీఎల్‌ఎం మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి సంబంధిత టీఎల్‌ఎం మేళా ప్రదర్శన కార్యక్రమాన్ని తిలకించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులను స్వయంగా పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ తనిఖీలు


విద్యుత్ చౌర్యంపై తనిఖీ చేస్తున్న విద్యుత్ అధికారులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు ఎస్ఈ ఏ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న 35 మందిపై కేసులు నమోదు చేశారు. సుమారు రూ.4 లక్షలు అపరాధ రుసంను వారిపై విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు కే రమేష్, డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు మధుసూధన్ రావు, మధులత, యర్రగుంట్ల, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కిరణ్‌కుమార్‌లు, అసిస్టెంట్ ఇంజనీర్లు నాగరాజు, వీరాంజనేయరెడ్డి, రవికుమార్, మస్తాన్‌లు పాల్గొన్నారు.

రేపు వైవీయూలో జాబ్‌మేళా

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి తెలిపారు. టీసీఎల్, అపోలో ఫార్మసీ కంపెనీలు దాదాపు 200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వస్తున్నట్లు తెలిపారు. టీసీఎల్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఫార్మా కంపెనీలో ఉద్యోగాల కోసం బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ చేసిన వారు అర్హులని తెలిపారు.

26న మహిళా డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 26వ తేదీన ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగానికి క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఏదైనా డిగ్రీ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9059066031 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తాండా ప్రజలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

కడప కార్పొరేషన్: చింతకొమ్మదిన్నె మండలం గురుంగుంపు తాండ గిరిజన వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డా. శివానాయక్, జిల్లా అధ్యక్షుడు జగన్ రాథోడ్ కోరారు. సోమవారం కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. జీఎస్ఎస్ ముంపు కింద గురుంగుంపు తాండ గిరిజన వాసులకు కేవలం 5 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. కానీ వారికి ఇంటి నిర్మాణానికి కావలసిన డబ్బులు, ఇంటి స్థలం పట్టాలు కానీ ఇప్పటికీ మంజూరు కాలేదు. గిరిజన ప్రజానీకానికి మంజూరు చేయవలసిన అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తూ వీలైనంత తొందరగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

ఉత్సాహంగా స్కౌట్స్ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్ : కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న బేసిక్ శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. శిక్షణలో భాగంగా సోమవారం కబ్, స్కౌట్, రోవర్ మాస్టర్లకు టెంట్ ఏర్పాటు, అత్యవసర సమయాల్లో వ్యవహరించే తీరు, స్పందించే విధానాలపై శిక్షణ అందించారు. వ్యాయామం ప్రాధాన్యత తెలియజేప్పేలా శిక్షణలో ప్రతిరోజూ వ్యాయామాలు చేయిస్తున్నట్లు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి డి. ప్రమీల తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వల్లూరులో హెల్మెట్ వాడడంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకట రమణ

వల్లూరు : ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వల్లూరు ఎస్‌ఐ కత్తి వెంకట రమణ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు హెల్మెట్ ఉపయోగించడంపై మండల కేంద్రమైన వల్లూరులో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నుంచి కడప – తాడిపత్రి ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఒక ద్విచక్ర వాహనదారుడు, పిలియన్ డ్రైవర్ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య

వేంపల్లె : దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగీ తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఇమామ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ఫీవర్, లార్వా సర్వేలు చేపట్టారు. దోమల నివారణకు సైఫోనోత్రిన్ పిచికారీ చేశారు. సిద్ధయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురవడంతో విషజ్వరాలు ప్రభలకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇఓ బాబా ఫక్రుద్దీన్, సీహెచ్ఓ రుక్మిణి, ఆరోగ్య కార్యకర్తలు సౌభాగ్య, స్వప్న తదితర ఆశాలు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

జమ్మలమడుగు : పది రోజులవుతున్నా గ్రామంలోని చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తీసుకెళ్లకపోవడంతో ఇళ్లలోని చెత్తను ప్రజలు రోడ్లమీద పడేస్తున్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఎర్పడిన తర్వాత మండల పరిధిలోని మోరగుడి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గతంలో ప్రతిరోజు ఇంటింటికి వచ్చి చెత్తను తీసుకెళ్లేవారు. ప్రస్తుతం గ్రామంలో పరిశుద్ధ్య చర్యలు చేపట్టే నాథుడే కరువయ్యారు. గ్రామంలో ఎక్కడ పడితే అక్కడే చెత్తను పడేస్తున్నారు. దీంతో కాలువలు చెత్తతో నిండిపోయాయి. దీంతో దోమలు పెరిగిపోయి ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు.


వీధిలో పడేసిన వ్యర్థాలు


ఇంటి ముందు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయిన కాలువ